సాక్షి
జగిత్యాల
ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు: కొండగట్టు ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ ఏఈవో అంజయ్య, సూపరింటెండెంట్లు శ్రీనివాసశర్మ, సునీల్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మాటలు, పాటలతో ఊపు

మన యాసకు, భాషకు ప్రత్యేకత ఉంది. ఇవే ఎన్నికల ప్రచారానికి జీవం పోస్తున్నాయి.

8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.0/29.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం నుంచే ఎండవేడిమి మొదలవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. వేడిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ఘనంగా సంకటహర చతుర్థి వేడుకలు



మహాగణపతికి పూజలు చేస్తున్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి అనుబంధం మహాగణపతి ఆలయంలో శనివారం సంకటహర చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, ముత్యాలశర్మ ఆధ్వర్యంలో ఉపనిషత్తులతో అభిషేకం, హారతి మంత్ర పుష్పం గావించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి



జెండా ఆవిష్కరిస్తున్న విద్యాసాగర్‌రావు

జగిత్యాల: బీఆర్‌ఎస్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నాయకులు మరిచిపోయారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు అన్నారు. భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. కేసీఆర్ హయాంలో పథకాలు ప్రజలకు సకాలంలో అందాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు రాంచందర్‌రావు, గట్టు సతీశ్, శ్రీలత, ఆనందరావు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి శ్రీధర్

పెగడపల్లి: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి శ్రీధర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో జరిగిన ప్రసవాలు, గర్భిణుల నమోదు పరిశీలించారు. ఇమ్యూనైజేషన్, చిన్నారుల టీకాలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాక్సినేషన్.. పిల్లల వ్యాధి నిరోధక టీకాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు నరేశ్, రమ, నర్సింగ్ ఆఫీసర్ రవికిరణ్, సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, అనిల్‌జాదవ్, హెచ్‌వీ జయశీల, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్

కోరుట్ల: అంగన్‌వాడీలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయీశ్వరి ఆరోపించారు. కోరుట్లలో శనివారం మాట్లాడుతూ అంగన్‌వాడీలు 20 రోజులు సమ్మె చేస్తే అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ పథకం ద్వారా టీచర్‌కు రూ.2లక్షలు, ఆయాకు రూ.లక్ష ఇవ్వడంతో పాటు ఆసరా పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చిందని, ఈ మేరకు జీఓ కూడా విడుదల చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అని చెప్పుకుంటూ ఐసీడీఎస్ మెమో 1334/సీడీఎస్-1/2024 ప్రకారం ఏప్రిల్ 31నాటికి సర్వీస్ పూర్తిచేసిన టీచర్‌కు రూ.లక్ష, ఆయాకు రూ.50వేలు ఇచ్చేలా జీవో జారీ చేయడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వం ప్రతినెలా 14 తేదీ వరకు వేతనాలు అందించేదని, ఇప్పుడు రెండు నెలలు కావస్తున్నా ఇవ్వడం లేదన్నారు. వేసవి సెలవులు ఇస్తామని చెప్పిన మంత్రి సీతక్క హామీ నిలుపుకోలేదన్నారు.

బల్దియాలో అందని సేవలు

- అందుబాటులో ఉండని సిబ్బంది
- ఎన్నికల విధులంటూ సాకు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



కార్యాలయంలో ఏర్పాటు చేసిన పౌరసేవ కేంద్రం బోర్డు



మున్సిపల్ కార్యాలయం

జగిత్యాల: జిల్లాలోని మున్సిపాలిటీల్లో ప్రజలకు సేవలు సక్రమంగా అందడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మ్యూటేషన్లు జరగాలన్నా.. ఇంటి అనుమతులు రావాలన్నా.. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపడాలన్నా.. ప్రజలకు మున్సిపల్ కార్యాలయమే దిక్కు. ఫలితంగా కార్యాలయానికి నిత్యం ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. అయితే మున్సిపల్ అధికారులు ఎన్నికల విధుల సాకుతో కార్యాలయానికి ఎక్కువ సమయం కేటాయించడం లేదు. వివిధ పనులపై బయటకు వెళ్లిపోతున్నారు. దీంతో కార్యాలయానికి వస్తున్న ప్రజలు వేచిచూసి చూసి నానా ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణ ప్రణాళిక విభాగంలో పనిచేస్తున్న టీపీవో సైతం ఎన్నికల విధులు కేటాయించారు. టీపీఎస్ సెలవులో వెళ్లారు. దీంతో ఆశాఖను పట్టించుకునేవారే కరువయ్యారు. అంతేకాక ఇంజినీరింగ్ విభాగంలో సైతం ఇద్దరు ఏఈలకు విధులకు వెళ్లిపోవడంతో ప్రజలు కార్యాలయానికి వస్తే సమాధానం చెప్పేవారే కరువయ్యారు. అంతేకాక కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు కంప్యూటర్ ఆపరేటర్లు, శానిటేషన్‌లోని వారిని వివిధ పనులకు వినియోగించుకుంటున్నారు. దీంతో ప్రజల పనులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి.

వేధిస్తున్న సమస్య

జిల్లాలో జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ బల్దియాల్లో అనేక సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయి. డ్రైయినేజీల్లో పూడికతీత, కొత్త మురికినీటి కాలువల నిర్మాణం, విద్యుద్దీపాల ఏర్పాటు, పట్టణ సుందరీకరణ పనుల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. అధికారుల పనితీరుపై కొందరు కౌన్సిలర్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కమిషనర్ కూడా నిత్యం జూమ్ మీటింగ్‌లు అంటూ వెళ్లిపోవడంతో ప్రజలు కార్యాలయం చుట్టు తిరగాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

ఎన్నికల సాకుతో..

ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సిబ్బంది అంతా విధులకు వెళ్లారని ప్రజలకు సమాధానం వస్తోంది. వాస్తవంగా ఒకరిద్దరికి విధులు వేసినా మిగతా వారు సైతం విధులను సాకుగా చూపుతూ కార్యాలయానికి రావడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం ఏ విభాగంలో పనిచేస్తున్న అధికారులు ఏదైనా విధులకు వెళ్లినప్పుడు మున్సిపల్ బుక్‌లో రాసి వెళ్లాల్సి ఉంటుంది. అంతేకాకుండా కొన్ని డిపార్ట్‌మెంట్ల అధికారులు ఏకంగా తాళం వేసి వెళ్తున్నారు. ఇటీవలే విజిలెన్స్ అధికారులు సైతం శానిటేషన్, పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన రికార్డులు ఇవ్వాలని ఆదేశాలు వచ్చిన విషయం తెలిసిందే. కొందరు అధికారులు తాళాలు వేసుకుని పని చేస్తున్నట్లు తెలిసింది. ఈ విభాగాలపై గతంలో కౌన్సిలర్లు సైతం ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ కార్యాలయం తీరు మారలేదు.

సెల్ ఫోన్లు ఎత్తని అధికారులు

మున్సిపల్ కార్యాలయంలో ఏ అధికారి కూడా ఫోన్లు ఎత్తి సమాధానం చెప్పడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా ప్రజలకు ఏదైనా సమస్య ఏర్పడినా, పారిశుద్ధ్యం, వీధిబల్బులు, డ్రెయినేజీ సమస్యలు, ఏ సమస్య వచ్చినా మున్సిపల్ విభాగం అధికారులకు ఫోన్ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం కూడా ప్రజల కోసం అధికారులకు సిమ్‌లు అందించింది. అయినా ఏ ఒక్క అధికారి కూడా ఫోన్ ఎత్తరనే అపవాదు ఉంది.

పేరుకే సిటిజన్ బడ్డీ యాప్

మున్సిపాలిటీల్లో నిత్యం ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు.. పౌరులకు సత్వర సేవలందించేందుకు సిటిజన్ బడ్డీ యాప్‌ను ఏర్పాటు చేశారు. దీనిపై ప్రజలకు పెద్దగా అవగాహన లేకపోవడంతో అది పేరుకు మాత్రమే ఉంది. దీని ద్వారా మున్సిపాలిటీలోని ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. ఇందులో ప్రధానంగా రహదారులు, విద్యుత్ సమస్యలు, రెవెన్యూ పరమైన సేవలు అన్ని ఇందులో ఉంటాయి. కానీ ఏ ఒక్కటీ పరిష్కారం కావడం లేదు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను మున్సిపల్‌లో సంబంధిత విభాగం అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. సిబ్బంది సక్రమంగా లేకపోవడంతో వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అలాగే కార్యాలయంలో సైతం ఏ పని ఎన్ని రోజుల్లో చేయాలన్నది పౌరసేవ కేంద్రం బోర్డు సైతం ఏర్పాటు చేశారు. ఇందులో ఏ పనీ సక్రమంగా కాదు. ప్రతిపనికీ ఏడు రోజుల సమయం ఉన్నప్పటికీ కార్యాలయం చుట్టూ నెల రోజులు తిరిగినా ఆ పనులు కాక ఇబ్బందులు పడుతున్నారు.

ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు



జగిత్యాల బల్దియాలో ఏ విభాగంలోనూ అధికారులు ఉండటం లేదు. ప్రజల పనుల కోసం వెళ్తే ఏదో పనిపై వెళ్లామని చెబుతున్నారు. కనీసం రిజిస్టర్‌లో కూడా రాయడం లేదు. ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. అధికారులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలి.

– జయశ్రీ, కౌన్సిలర్, జగిత్యాల

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న విప్, నాయకులు

కోరుట్ల: కోరుట్లలో మే ఒకటిన నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనే బహిరంగసభను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కోరుట్ల శివారు పెద్దగుండు సమీపంలోని వెటర్నరీ యూనివర్సిటీ ముందు సభా స్థలాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుతో కలిసి పరిశీలించారు. సభకు భారీగా జనాన్ని తరలించాలన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం సభా స్థలి పరిశీలించిన ఎస్పీ

కోరుట్లరూరల్: రేవంత్ రెడ్డి సభ ఏర్పాట్లను ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ శనివారం సాయంత్రం పరిశీలించారు. ఆయన వెంట మెట్‌పల్లి డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

మే మూడున వెల్గటూర్‌లో..

వెల్గటూర్ : మే మూడో తేదీన ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని, విజయవంతం చేయాలని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పార్టీ మండల అధ్యక్షులతో కలిసి శనివారం సభాస్థలిని పరిశీలించారు. పెద్దపల్లి పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ తరఫున ప్రచారం చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మద్దుల గోపాల్‌రెడ్డి, శైలేందర్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, దినేశ్, పూదరి రమేశ్, గెల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీవన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల: నిరంతరం ప్రజాసేవలో ఉండే జీవన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఇందిరాభవన్‌లో కార్యకర్తలతో సమావేశమయ్యారు. నిర్వహించారు. జీవన్‌రెడ్డి జగిత్యాలను అభివృద్ధి చేశారని, ఆయనను ఎంపీగా గెలిపించుకుంటే మరింత అభివృద్ధి అవుతుందని తెలిపారు. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, గిరినాగభూషణం, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మీ, దేవేందర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, పిప్పరి అనిత, బండ శంకర్, మన్సూర్ పాల్గొన్నారు. అంతకుముందు అడువాల జ్యోతి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, చిత్రంలో కలెక్టర్ యాస్మిన్ బాషా

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్, వ్యయ పరిశీలకులు డీఎం నెమ్మి, పోలీస్ శాఖ అబ్జర్వర్ రాజేశ్ మీనా శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉన్నతాధికారులు, నోడల్ ఆఫీసర్లు, జగిత్యాల కలెక్టర్ యాస్మీన్ బాషా, ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ పాల్గొన్నారు. ఎన్నికల నియమావళి అమలు, పోలింగ్, కౌంటింగ్‌కు చేపట్టిన చర్యలపై అబ్జర్వర్లకు వివరించారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 17,04,867 మంది ఓటర్లు ఉండగా, నిజామాబాద్ జిల్లాలో 1,288 పోలింగ్ స్టేషన్లు, జగిత్యాలలో 516 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో రూ.1.22 కోట్ల నగదు, రూ.1.28 కోట్ల విలువ చేసే బంగారం, ఇతర వస్తువులను సీజ్ చేశామన్నారు. పోలీసులు, ఎక్సైజ్ శాఖల ద్వారా 52వేల లీటర్ల అక్రమ మద్యం నిల్వలను గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. 15మంది కన్నా ఎక్కువ అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచిన పక్షంలో అదనంగా బ్యాలెట్ యూనిట్లు కేటాయించేలా ఏర్పాట్లు చేసుకున్నామని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి మొదటి విడత శిక్షణ తరగతులు పూర్తి చేశామని, మే 1, 2వ తేదీల్లో రెండోదఫా శిక్షణకు ఏర్పాట్లు చేశామన్నారు. 85వేల పైచిలుకు స్లిప్పుల పంపిణీ పూర్తయ్యిందని వివరించారు. డిచ్‌పల్లి సీఎంసీ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశామన్నారు. జగిత్యాల కలెక్టర్ కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో చేపట్టిన ఏర్పాట్లపై పరిశీలకుల దృష్టికి తెచ్చారు.

కరీంనగర్ జైలుకు సైబర్ క్రైం నిందితులు

కోరుట్ల: నాలుగు నెలల క్రితం కోరుట్లకు చెందిన విశ్రాంత ఉద్యోగి బాసెట్టి శంకరయ్యను సీబీఐ కేసు పేరుతో బెదిరించి ఆన్‌లైన్‌లో రూ.4.23కోట్లు కాజేసిన కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న సైబర్ నేరగాళ్లను కస్టడీకి తీసుకుని విచారించిన కోరుట్ల పోలీసులు శనివారం కరీంనగర్ జైలుకు తరలించారు. ఈ కేసులో ఏ-1 షౌకత్ అలీ, ఏ-2 అబ్దుల్ బాసిత్ మునముల్లి, ఏ-3 సిద్దిక్కున్ అక్బర్, ఏ-4 అజ్మల్ పొక్కత్తు వల్‌పాల్, ఏ-5 ఖమ్రుద్దీన్ చిరక్క పరంబిని విచారించిన అనంతరం తిరిగి కరీంనగర్ జైలుకు తరలించారు. నిందితుల నుంచి సైబర్ క్రైం కేసు వివరాలు సేకరించినట్టు సీఐ సురేష్‌బాబు వివరించారు. నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన రంగారెడ్డి జిల్లా సైబర్ క్రైం డీఎస్పీ, మేడిపెల్లి ఎస్సై శ్యామ్ రాజ్, జగిత్యాల సైబర్ క్రైం కానిస్టేబుల్ మహేశ్, మేడిపెల్లి కానిస్టేబుల్ చంద్ర శేఖర్, కోరుట్ల కానిస్టేబుల్ సంతోష్‌ను ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

పదేళ్లలో హామీలపై ఆత్మపరిశీలన చేసుకోవాలి



మేడిపల్లి మండలంలో తాటిముంజలు కోస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



కథలాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం, పాల్గొన్న విప్ ఆది, ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు


- కథలాపూర్ కార్నర్ మీటింగ్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్

కథలాపూర్(వేములవాడ): బీఆర్‌ఎస్ హయాంలో వారిచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో మాజీమంత్రి హరీశ్‌రావు ఆత్మపరిశీలన చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. శనివారం కథలాపూర్ మండలకేంద్రంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్ని డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించిందో.. నిరుద్యోగులకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15 లోపు రుణమాఫీ అమలు చేస్తామన్నారు. హరీశ్‌రావు తన రాజీనామా లేఖను అప్పటివరకు దాచుకోవాలన్నారు. నియోజకవర్గంలోని కలిగోట సూరమ్మ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. బీజేపీ నాయకులు చేసిన అభివృద్ధిని చెప్పుకోలేని పరిస్థితుల్లో దేవుడి పేరిట ఓట్లు అడుగుతున్నారన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉపాధిహామీ కూలీలకు కనీస వేతనం రూ.400కు పెంచేందుకు కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ డీసీసీ కార్యదర్శి చెదలు సత్యనారాయణ, జిల్లా నాయకులు బోదాస్ రెడ్డి, కట్ట శంకర్, వంగ మహేశ్, పార్టీ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు ఎండీ.అజీమ్, ఎండీ.హఫీజ్, మ్యాదరవేని రాజు, వాకిటి రాజారెడ్డి, గడ్డం చిన్నారెడ్డి, దేవారెడ్డి, స్వామిరెడ్డి, ఎండీ.రేహన్, గాజ ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

కొండగట్టు/మేడిపల్లి: కరీంనగర్ ఎంపీగా గెలిపిస్తే చివరి రక్తపు బొట్టు వరకు ప్రజలకు సేవ చేస్తానని కరీంనగర్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు అన్నారు. శనివారం కొడిమ్యాల మండలకేంద్రంతోపాటు మేడిపల్లి, భీమారంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు మేడిపెల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. దేశంకోసం బలిదానాలు చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధరలు తగ్గిస్తుందని తెలిపారు. భీమారంలో ఉత్కం శంకర్‌గౌడ్ కోరికమేరకు మంత్రి పొన్నం ఎల్లమ్మతల్లికి 200 కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం తాటిముంజలు తిన్నారు. స్వయంగా తాటిముంజలు కోస్తుండగా.. ఉలి తగిలి పొన్నంకు స్వల్ప గాయమైంది. ప్రథమ చికిత్స కోసం స్థానికులు ప్రయత్నించగా.. వద్దని వారిస్తూ ప్రచారంలో పాల్గొన్నారు.

రికార్డుల కోసం తంటాలు



లాగ్‌బుక్‌లో రాసిన వివరాలు



లాగ్‌బుక్‌లో వివరాలు రాస్తున్న బల్దియా సిబ్బంది

- ఇప్పుడు రాస్తున్న బల్దియా అధికారులు
- విజిలెన్స్ అధికారుల ఆదేశాలతో ఆందోళన

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీలో పలు శాఖల్లో అవినీతి, నిధుల దుర్వినియోగం పెరిగిపోయిందన్న ఆరోపణలు రావడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘా పెట్టారు. శానిటేషన్ విభాగం రికార్డులు పంపించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో బల్దియా అధికారుల్లో ఆందోళన మొదలైంది. అధికారుల అవినీతిపై 'సాక్షి'లో వరుస కథనాలు రావడంతో ఉన్నతాధికారులు దృష్టి సారించి.. ఏయే విభాగంలో ఏం జరుగుతోందో తెలుసుకునే పనిలో పడ్డారు. వాహనాల స్టాక్ రిజిస్టర్లు, రిపేరు రిజిస్టర్లు, పారిశుధ్యానికి సంబంధించిన కెమికల్స్ టెండర్ల రికార్డులు ఇవ్వాలని ఆదేశించారు.

రికార్డులు రాస్తున్న బల్దియా సిబ్బంది

గతంలో జరిగిన పనులకు సంబంధించిన రికార్డులను సిబ్బంది ఇప్పుడు రాస్తుండడం గమనార్హం. వాస్తవానికి రికార్డులు ఎప్పటికప్పుడు రాయాల్సి ఉంటుంది. తాజాగా రాస్తుండడం వెనుక గతంలో ఉన్న రికార్డులు తప్పుల తడకగా ఉన్నాయా..? అనే అనుమానం వస్తోంది. ఏ వాహనం ఎటు వెళ్లింది..? ఎక్కడెక్కడికి వెళ్లింది..? వార్డులో ఎక్కడ చెత్త తీశారు..? ఎన్ని ట్రిప్పులు తరలించారు..? ఎక్కడికి తరలించారనే వివరాలను రికార్డుల్లో చేర్చుతున్నారు. గతేడాది చేపట్టిన ఆ పనులను గుర్తుంచుకుని ఇప్పుడెలా రాస్తున్నారో అర్థంకాని ప్రశ్నగా మారింది. అలాగే వాహనాలకు గతంలో రూ.10లక్షలు వెచ్చించి జీపీఎస్ ఏర్పాటు చేశారు. అది పనిచేస్తుందా లేదా తెలియని పరిస్థితి. పనిచేస్తే ఎప్పటికప్పుడు రికార్డు అయి ఉంటుంది. దీనిపై బల్దియా అధికారులను వివరణ కోరగా కొన్ని ఇన్‌వాయిస్ నంబర్లు పొరపాటు పడ్డాయని, తప్పిపోయిన వాటిని లాగ్‌బుక్‌లో రాస్తున్నామని చెబుతున్నారు. విజిలెన్స్ అధికారులు అన్ని రికార్డులు అడగడంతో కొత్తగా రికార్డులు తయారు చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబును వివరణ కోరగా.. లాగ్‌బుక్‌లను ఒకసారి చెక్ చేసుకుని మిస్సింగ్‌లు ఉంటే చేర్చుతున్నామని, అందులో తప్పేమీ లేదని తెలిపారు.

క్లుప్తంగా

క్షణికావేశం.. ప్రాణం తీసింది

- తమ్ముడిని హత్య చేసిన అన్న


వెంకటేశ్ (ఫైల్)

కరీంనగర్‌రూరల్: అన్నదమ్ముల మధ్య గొడవ తమ్ముడి ప్రాణం తీసింది. క్షణికావేశంలో ఓ వ్యక్తి తన తమ్ముడిని హత్య చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ మండలంలోని బొమ్మకల్‌కు చెందిన కాల్వ రాయమల్లు–బాలమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు శ్రీనివాస్, వెంకటేశ్ ఉన్నారు. పెద్ద కొడుకు శ్రీనివాస్ హమాలీ పని చేస్తుండగా చిన్న కొడుకు వెంకటేశ్(28) ఇంట్లో ఖాళీగా ఉంటున్నాడు. నిత్యం మద్యం తాగొచ్చి, తల్లిదండ్రులు, అన్నతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 5 గంటలకు సోదరుల మధ్య వివాదం నెలకొంది. మాటామాట పెరగడంతో శ్రీనివాస్ క్షణికావేశంలో కత్తితో వెంకటేశ్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబసభ్యులు ఈ విషయాన్ని దాచేందుకు ప్రయత్నించగా స్థానికులు రాత్రి పోలీసులకు సమాచారం అందించారు. కరీంనగర్ రూరల్ ఎస్సై శేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వెంకటేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రాజన్న సేవలో గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి



వేములవాడ: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శనివారం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ గౌతమి, తహసీల్దార్ మహేశ్, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు శ్రీరాములు ఉన్నారు. అలాగే, మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు రాజన్నను దర్శించుకున్నారు.

కారు ఢీకొని జింక మృతి



కథలాపూర్(వేములవాడ): కారు ఢీకొన్న ఘటనలో ఓ జింక మృతిచెందింది. అటవీశాఖ అధికారుల వివరాల ప్రకారం.. కోరుట్ల–వేములవాడ దారిలో కథలాపూర్ మండలం దుంపేట శివారు వరద కాలువ వద్ద శనివారం ఉదయం జింక రోడ్డు దాటుతోంది. ఆ సమయంలో కోరుట్ల నుంచి వేములవాడ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జింక తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందింది. అటవీశాఖ అధికారులు, పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. కథలాపూ ర్ పశువైద్యశాలలో పశువైద్యాధికారి దివ్యశ్రీ జింక కళేబరానికి పోస్టుమార్టం చేశారు.

చింతచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి


చిన్నరాజం మృతదేహం

కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్‌కు చెందిన శనిగరపు చిన్నరాజం(60) చెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. చిన్నరాజం శనివారం చింత చెట్టు ఎక్కాడు. చింతకాయలు దులుపుతుండగా కాలు జారి, కిందపడ్డాడు. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మాటలు, పాటలతో ఊపు

- ఎన్నిక ఏదైనా ప్రచారంలో ఉమ్మడి జిల్లా కళాకారులదే హవా
- రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు
- మిద్దె రాములు ఒగ్గుకథతో మొదలై, నేడు ఎందరికో ఉపాధి


ఒగ్గు కథ చెప్పుతున్న మిద్దె రాములు (ఫైల్)


స్టూడియోలో ఎన్నికల పాట రికార్డింగ్

విద్యానగర్(కరీంనగర్): మన యాసకు, భాషకు ప్రత్యేకత ఉంది. ఇవే ఎన్నికల ప్రచారానికి జీవం పోస్తున్నాయి. ఓ లచ్చక్కా.. మళ్లీ ఎలచ్చన్లు వచ్చినాయే.. పార్టీలోళ్లు అన్నీ ఇత్తామని, ఓటెయ్యమని ఇంటింటికీ వత్తున్నరే అంటూ ఒక పల్లె ముసలవ్వ గొంతు ఓ పార్టీ ప్రచారంలో వినిపిస్తే.. జెండలమ్మ జెండాలు అంటూ మరో గొంతు మైక్‌లో అదరగొడుతోంది. ఇటువంటి గొంతుకలు అన్ని పార్టీలకు పాట, మాటను అందిస్తూ తద్వారా ఉపాధి పొందుతున్నాయి. విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా, ఆలోచించుకునేలా చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లా కళాకారులకు ఇక్కడే కాదు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు, ఆదరణ లభిస్తోంది.

1978 అసెంబ్లీ ఎన్నికల నుంచి..

జాతీయ కాంగ్రెస్‌ను వీడి ఇందిరా కాంగ్రెస్ ఏర్పడిన తర్వాత 1978లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. కరీంనగర్ నుంచి ఇందిరా కాంగ్రెస్ తరఫున నలుమాచు కొండయ్య బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో తొలిసారి సభకు వచ్చే జనాలను కట్టిపడేసేందుకు స్టేజీలపై జన గొంతుకకు ప్రాధాన్యం ఇచ్చారు. మిద్దె రాములు పచ్చ పచ్చ గట్ల మీద నడిచినావే ఇందిరమ్మ.. మా ఓటు నీకే ఇత్తుమే ఇందిరమ్మ అంటూ.. నియోజకవర్గ పరిధిలో ఒగ్గుకథ ప్రదర్శనలు ఇచ్చారు. అలా ప్రారంభమైన జానపద ప్రచార సరళి ఆ తర్వాత కొత్త పుంతలు తొక్కుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా జనం పాటల గొంతుకలు ఎన్నికల సమయాల్లో ఆయా పార్టీల ప్రచారానికి ఊపు తీసుకువస్తున్నాయి.

3 ప్రధాన పార్టీలదీ ఇదే దారి..

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీల జెండలే రామక్కా.. అంటూ బీఆర్ఎస్ పార్టీ, గుండె గుండె కొలువు మన కమలం పువ్వు.. గుడిసే గుడిసే నెలవు మన కమలం పువ్వు అంటూ బీజేపీ ప్రచారం చేశాయి. ఇంద్రవెల్లి కొండల్లో దండు పుట్టింది.. అంటూ జన గొంతుకలతో జానపద బాణీల్లో ప్రచారం సాగించిన కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో పోరాటమన్నది కొత్తకాదే ఓ తల్లి లచ్చువమ్మ.. బాపు ఆరాటపడకుంటే రాష్ట్రమేదే నా తల్లి లచ్చువమ్మ అంటూ బీఆర్ఎస్, జై జై జెజ్జనక జాతర.. వెయ్ వెయ్ బండి సంజయన్న గెలుపు దండోరా మోగేలా, మళ్లీ కావాలి మన దేశానికి మోదీ.. తప్పక గెలవాలి కరీంనగర్‌లో బండి అంటూ బీజేపీ ప్రచారం సాగిస్తుండగా, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోని మూడు రంగుల జెండా పట్టి సింగమోలే కదిలినాడు మన రేవంతన్న అనే పాటనే ప్రచారంలో వినియోగిస్తున్నారు.

జన గొంతుకలు..

కరీంనగర్‌లో జి.ప్రభు రికార్డింగ్ స్టూడియోతోపాటు కీబోర్డు వాయిద్యకారులుగా, ముమ్మాడి బ్రహ్మచారి ఎంబీఏ పేరుతో రికార్డింగ్ స్టూడియో, జీఎం రికార్డింగ్ స్టూడియో, రత్నం స్టూడియో, కేబీ శర్మ గాయకుడిగా, కీబోర్డు వాయిద్యాకారుడిగా రాణిస్తూనే రికార్డింగ్ స్టూడియో నిర్వహిస్తున్నారు. కరీంనగర్‌కు చెందిన బుర్ర సతీశ్, గుండేటి రమేశ్, కందుకూరి శంకర్‌బాబు, గజ్జెల వినోద, సల్వాజీ సంధ్య, భవాని, జ్యోతి, మడుపు శ్రీనివాస్, తిపర్తి ప్రభు, హుస్నాబాద్‌కు చెందిన రాంసాగర్ లక్ష్మణ్, నక్క శ్రీకాంత్ తదితరులు ఈ రంగంలో రాణిస్తున్నారు.

2011లో తొలి ఎన్నికల పాట



కీబోర్డు ఆర్టిస్టుగా, సౌండ్ ఇంజినీర్‌గా, రికార్డింగ్ స్టూడియో ద్వారా ఈ రంగంలోకి వచ్చి, 18 ఏళ్లు అవుతోంది. 2011లో తొలి ఎన్నికల పాట రికార్డు చేశాను. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో ఇప్పటివరకు 60 పాటలు రికార్డు చేశాను.– జి.ప్రభు, కీబోర్డు ఆర్టిస్ట్, జి.స్టూడియోస్, మైత్రినగర్, రేకుర్తి, కరీంనగర్

500 వరకు రాసి, పాడిన



దాదాపు 500 పాటలు రాసి, పాడిన. 2004లో మొదటిసారి విద్యాసాగర్‌రావుకు పార్లమెంట్ ఎన్నికల్లో నాగారంలో పుట్టిన సాగర్ జీ అంటూ రాసి, పాడాను. ప్రస్తుతం ప్రజా సైన్యమై కదిలిన మోదీని ఆపేదెవడు అంటూ బీజేపీకి పాట రాసి, పాడిన. – గుండేటి రమేశ్, పాటల రచయిత, గాయకుడు, కరీంనగర్

అనేక పార్టీలకు నా మాట



ఎన్నికల ప్రచార పాటల్లో అభ్యర్థులకు ఓటు వేయాలనే స్లోగన్స్ చెప్పాను. కార్పొరేషన్ మొదలుకొని పార్లమెంట్ ఎన్నికల వరకు అనేక పార్టీలకు నా మాట అందించాను.

– రాధిక, షార్ట్ ఫిల్మ్ యాక్టర్, కరీంనగర్

అన్ని పార్టీలకు పాడాను



నేను 15 ఏళ్లుగా జానపద పాటలు పాడుతున్నాను. తెలంగాణ, ఆంధ్రలోని అన్ని రాజకీయ పార్టీలకు పాడాను. జైజై ఈటల రాజేందరన్న అనే పాట ఎక్కువ పేరు తెచ్చింది.

– సల్వాజీ సంధ్య, గాయని, కరీంనగర్

ఉద్యమ సమయంలో గుర్తింపు



రాష్ట్ర ఉద్యమ సమయంలో భగభగమంటున్న తెలంగాణ పాటతో నాకు గుర్తింపు వచ్చింది. రాష్ట్రం వచ్చాక సుద్దాల అశోక్ తేజ ప్రోద్బలంతో తొలిసారి కెప్టెన్ లక్ష్మీకాంతారావుకు ఎన్నికల పాట పాడిన.

– గజ్జెల వినోద,గాయని,నగునూర్, కరీంనగర్

వేలాది పాటలు



జానపద గాయకుడిగా 1998 నుంచి ఇప్పటివరకు వేలాది పాటలు పాడిన. ప్రతీ ఎన్నికల్లో అన్ని పార్టీలకు నా పాట ఉంటుంది. – బుర్ర సతీశ్, జానపద గాయకుడు, కరీంనగర్

ప్రచారం కోసం స్లోగన్స్



2019 నుంచి ఏదో ఒక పార్టీకి ప్రచార స్లోగన్స్ ఇస్తున్నాను. అసెంబ్లీ, పార్లమెంట్, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఇలా అన్ని ఎన్నికలకు పని చేస్తున్నాను. – భవాని, లఘుచిత్రాల నటి, తీగలగుట్టపల్లి, కరీంనగర్

రాజన్న సిరిసిల్ల జిల్లావాసులు..

సిరిసిల్ల టౌన్: ఎన్నికల ప్రచారంలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన సాంబారి రాజు, షేక్ ఖాజా తమ మా టతో ఆకట్టుకుంటున్నారు. సాంబారి కిరణ్ స్క్రిప్ట్ రైటర్‌గా, ఎండీ.సలీం ప్రచార ప్రకటనల్లో రాణిస్తున్నారు. ఇదే జిల్లాకు చెందిన సాంబారి నవీన్, కాయితోజు ప్రవీణ్, నాందేవ్, లావణ్య ఈ రంగంలో తమ ప్రతిభ చాటుతున్నారు.

వ్యాఖ్యాతగా సలీం అరంగేట్రం..

సిరిసిల్లకు చెందిన ఎండీ.సలీం 1974 నుంచి ప్రకటనల వ్యాఖ్యాతగా ఉంటున్నాడు. ఇతని గళం క్రమంగా జాతీయ స్థాయిలో వ్యాపార ప్రకటనలకు అరువిచ్చే స్థాయికి చేరింది. ఇందిరాగాంధీ నుంచి నేటి కేసీఆర్, కేటీఆర్, నర్సింగరావు, గొట్టె భూపతి తదితరులు.. నాయకులు ఎవరైనా, ఎన్నికలు ఎక్కడ జరిగినా సలీం స్వరం ప్రచారాస్త్రమైంది. హిందీ, ఉర్దూ, మరాఠీ భాషలు మాట్లాడే ప్రాంతాలకూ పరిచయమైంది. 1988లో ఆకాశవాణిలో 25 నిమిషాల ప్రత్యక్ష వ్యాఖ్యానంతో అలరించాడు. 1989లో స్వర్గీయ ఘంటసాల ఆలపించిన పాటలకు తన గొంతుతో వ్యాఖ్యానాన్ని ఇచ్చి, సిరిసిల్ల గడ్డ కీర్తిని పెంచారు. చాలా ఏళ్లు న్యూస్ రీడర్‌గానూ రాణించాడు. 1999లో దూరదర్శన్ న్యూస్ రీడర్ శాంతిస్వరూప్ ఆయనను సన్మానించడం విశేషం.

గురువు స్ఫూర్తితో రాజు..

సిరిసిల్ల నేత కుటుంబానికి చెందిన సాంబారి రాజు గురువు సలీం స్ఫూర్తితో వ్యాఖ్యాత వృత్తినే ఎంచుకున్నాడు. చదివింది ఆరోతరగతి. ఉపాధి కోసం తన బాబాయ్ ప్రదీప్ ఆర్కెస్ట్రాలో చేరాడు. 15 ఏళ్ల క్రితం డబ్బింగ్ కళాకారుడుగా కెరీర్ ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగి, ప్రస్తుతం వ్యాపార ప్రకటనలతోపాటు ఎన్నికల ప్రచారానికి తన స్వరాన్ని అరువు ఇస్తున్నాడు. 20 ఏళ్లుగా 20 వేలకు పైగా వ్యాపార, ఎన్నికల ప్రకటనలతో తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందాడు. మరో పది మందికి ఉపాధినిచ్చే స్థాయికి ఎదిగాడు. కేసీఆర్, కేటీఆర్, ఈటల రాజేందర్, సుంకె రవిశంకర్, గంప గోవర్ధన్, షబ్బీర్ అలీలకు ప్రకటనలు చేసి, ఆకట్టుకున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ, జనసేన, టీడీపీలకు వ్యాఖ్యాతగా ఉన్నాడు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఆర్డర్లతో బిజీగా ఉంటున్నాడు.

శ్రోతల ఆశీస్సులే బలం



ఐదు దశాబ్దాలుగా నా ప్రకటనలు వింటూ ఇస్తున్న శ్రోతల ఆశీస్సులే నాకు బలం. నా గొంతును ఎన్నికలు, వ్యాపార, వాణిజ్య, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో వినిపిస్తున్నాను. ఎంతో మంది అభిమానాన్ని పొందిన నాకు రాజు, స్వాతి, శారద, రాజు, సురేశ్ ఇష్టమైన శిష్యులు. వారు కూడా ఇదే రంగంలో రాణిస్తుండటం సంతోషంగా ఉంది.

ఎండీ.సలీం

అన్ని భాషల యాసల్లో..



తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర భాషల యాసల్లోనూ వారు కోరినట్లు ప్రకటనలు చేస్తున్నాను. ఇందుకోసం లేటెస్ట్ ఎక్విప్‌మెంట్స్ వినియోగిస్తున్నాను. గురువుగారు సలీ సిరిసిల్లకు వరం. ఆయన స్ఫూర్తితో వ్యాఖ్యానంలో గుర్తింపు పొందాను. దేశంలో ఎక్కడికి వెళ్లినామన తెలుగు వాణి వినిపించాలి.

సాంబారి రాజు

గల్ఫ్ నకిలీ ఏజెంట్ల ముఠా గుట్టురట్టు

- సిరిసిల్ల యువకుడితో దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు
- పని పేరిట అమాయకులను మోసం చేస్తున్న ముఠా
- ఎస్పీ అఖిల్ మహాజన్


నకిలీ ఏజెంట్ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సిరిసిల్లక్రైం: ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లే యువకుల అవసరాలను ఆసరాగా చేసుకుని దేశవ్యాప్త సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠా గుట్టును సిరిసిల్ల పోలీసులు రట్టు చేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన యువకుడితో సైబర్ నేరాలు చేయిస్తున్న ముఠాలోని సభ్యుడు జగిత్యాల జిల్లా కొడిమ్యాలకు చెందిన కంచర్ల సాయిప్రసాద్‌ను జిల్లా పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ముఠాలోని మిగతా సభ్యులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోకు చెందిన సదాకత్, దుబాయికి చెందిన షాదాబ్‌లకు లుకౌట్ నోటీస్‌లు, మహారాష్ట్రలోని పుణేకు చెందిన అబిద్ అన్సారీకి నోటీస్‌లు జారీ చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపిన వివరాలు. నాలుగు రోజుల క్రితం రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరుకు చెందిన అతికం లక్ష్మి ఠాణాకు వచ్చి తన కొడుకు అతికం శివప్రసాద్ జగిత్యాలకు చెందిన గల్ఫ్ ఏజెంట్ కంచర్ల సాయిప్రసాద్‌కు రూ.1.40 లక్షల చెల్లించి కంబోడియా దేశానికి వెళ్లాడని, అక్కడ ఇబ్బంది పడుతున్నాడని ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు శివప్రసాద్‌తో వాట్సాప్ నంబర్‌లో మాట్లాడగా.. వారి ముఠా చేయిస్తున్న సైబర్ నేరాలను పోలీసులకు తెలిపారు. కంబోడియాలో చైనీస్ కంపెనీకి సంబంధించిన కొంతమంది వ్యక్తులు ఇండియాకు చెందిన 500 నుంచి 600 మంది పాస్‌పోర్టులు తీసుకొని అక్కడి నుంచే కాల్‌సెంటర్ ఏర్పాటు చేసినట్లు వివరించాడు. ఇండియాలో ఉన్న సదరు వ్యక్తులకు ఫోన్‌చేసి సైబర్ నేరాలు చేయిస్తున్నారని వివరించాడు. దీంతో సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి ఇండియన్ ఎంబసీని సంప్రదించగా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, దుబాయికి చెందిన ముగ్గురు ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. వెంటనే జగిత్యాలకు చెందిన గల్ఫ్ నకిలీ ఏజెంట్ కంచర్ల సాయిప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా.. తను రూ.10వేల కమీషన్ తీసుకొని మాల్దీవులలో ఉంటున్న లక్నోకు చెందిన సదాకత్‌కు పంపిస్తానని, అతను రూ.10వేల కమీషన్ తీసుకొని పుణేలోని అబిద్ అన్సారీకి పంపిస్తాడని వివరించారు. వీరి వెనుక ఉన్న బీహార్ రాష్ట్రానికి చెందిన ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటున్న షాదాబ్‌కు పంపగా.. ఆయన కంబోడియా దేశానికి పంపుతాడని తెలిపారు. కంచర్ల సాయిప్రసాద్ అదుపులోకి తీసుకున్నామని, మిగతావారిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ సహాయంతో ఈ కేసును ఛేదించినట్లు వివరించారు. ఉద్యోగం, ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లే యువకులు లైసెన్స్ ఉన్న ఏజెన్సీలను మాత్రమే ఆశ్రయించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లాలో ఎవరైతే ఏజెన్సీల లేదా ఏజెంట్ల చేతిలో మోసపోయారో వారి కోసం ఏర్పాటు చేసిన స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌ను 87126 56411లో ఫోన్‌కాల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు.

ఏసీబీకి చిక్కిన ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్



పట్టుబడిన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

- రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

గంగాధర(చొప్పదండి): గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయడానికి రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు కరీంనగర్ జిల్లా గంగాధర ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ శివారపు సురేశ్‌బాబు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐ తిరుపతి కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన కొక్కుల రాజేశంకు కరీంనగర్‌లోని రేకుర్తిలో సర్వే నంబర్ 131లో 10 గుంటల భూమి ఉంది. అందులో 4 గుంటలను తన కుమారుడు అజయ్‌కుమార్‌కు గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయడానికి గంగాధరలోని డాక్యుమెంట్ రైటర్ ఆకుల ఆంజనేయులును సంప్రదించాడు. రిజిస్ట్రేషన్‌కు ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ రూ.10 వేలు డిమాండ్ చేశారు. బతిమిలాడినా వినకపోవడంతో రాజేశం, ఆంజనేయులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారు చెప్పిన ప్రకారం లంచం ఇవ్వడానికి ఒప్పుకొని, అంజయ్య డబ్బులతో శనివారం ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ వద్దకు వెళ్లాడు. ఆయన ఆఫీస్‌లో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి శ్రీధర్‌కు ఇవ్వాలని సూచించారు. నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులను ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే 91543 88954 నంబర్‌కు ఫోన్ చేయాలని డీఎస్పీ సూచించారు.

ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఇంట్లో సోదాలు


కరీంనగర్ క్రైం: కరీంనగర్ మంకమ్మతోటలోని గంగాధర ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ సురేశ్‌బాబు ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. రూ.12.30 లక్షలు, 350 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.


మనోళ్లు.. విద్యావంతులు, శ్రీమంతులు


- ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు పట్టభద్రులు, కోటీశ్వరులే..


కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల వివరాలు

అభ్యర్థి	వయసు	విద్యార్హత	ఆస్తి (రూ.కోట్లలో)
వి.రాజేందర్‌రావు	62	బీఏ	26.58
బండి సంజయ్	52	ఎంఏ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్)	1.12
బి.వినోద్‌కుమార్	64	బీఎస్సీ, ఎల్ఎల్‌బీ	13.91
జీవన్‌రెడ్డి	72	బీఏ, ఎల్ఎల్‌బీ	3.55
ధర్మపురి అర్వింద్	47	ఎంఏ (పొలిటికల్ సైన్స్)	109.90
బాజిరెడ్డి గోవర్ధన్	69	బీఏ	4.61
గడ్డం వంశీకృష్ణ	35	బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్	24.09
గోమాసె శ్రీనివాస్	56	ఎంఏ (పొలిటికల్ సైన్స్)	23.22
కొప్పుల ఈశ్వర్	64	బీఏ	5.22


రాజేందర్‌రావు


సంజయ్



వినోద్‌కుమార్


జీవన్‌రెడ్డి


అర్వింద్


గోవర్ధన్


వంశీకృష్ణ


శ్రీనివాస్


ఈశ్వర్

సాక్షి, పెద్దపల్లి: ఒకప్పుడు ఎన్నికలంటే చాలామంది అత్తెసరు చదువులతో బరిలో దిగేవారు. కొందరైతే నిరక్షరాస్యులంటే అతిశయోక్తి కాదు. కానీ, కాలం మారింది. ఉద్యోగం కోసమే చదువు కాదు.. సమాజహితమే లక్ష్యంగా ఉన్నత విద్యావంతులు కూడా రాజకీయాలపై దృష్టిసారిస్తున్నారు. దీంతో ప్రతీ ఎన్నికల్లో పోటీచేసే విద్యాధికుల శాతం పెరుగుతోంది. ఈసారి పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో ఎక్కువమంది పట్టభద్రులే ఉండగా, వీరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు కోటీశ్వరులు కావడం గమనార్హం.

తక్కువ వయసు వంశీకృష్ణదే..

కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థుల్లో గడ్డం వంశీకృష్ణ (35)దే తక్కువ వయసు. 72 ఏళ్లతో అందరి కంటే సీనియర్‌గా జీవన్‌రెడ్డి ఉన్నారు. అలాగే, ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ అఫిడవిట్‌లో తెలిపిన వివరాల ప్రకారం.. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కి బంగారం, వినోద్‌కుమార్‌కు స్థిరాస్తులు లేవు. కొప్పుల ఈశ్వర్‌పై కేసులు, గడ్డం వంశీకృష్ణ సొంత కారు లేవు. బీజేపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్‌కు రూ.64 లక్షల ఇంటి లోన్ ఉంది. అగ్రికల్చర్ ల్యాండ్ లేదు. రూ.19.17 కోట్ల బ్యాంకు అప్పు ఉంది. జీవన్‌రెడ్డికి 35 ఎకరాల సాగు భూమి, 4 కేసులు ఉన్నాయి. బాజిరెడ్డి గోవర్ధన్‌కు 50 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. మొత్తంగా ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో రూ.1.12 కోట్లతో బండి సంజయ్ అతి తక్కువ, నిజామాబాద్ బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ 109.90 కోట్లతో ఎక్కువ ఆస్తులు కలిగి ఉన్నారు.

అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా


ఎంపికైన విద్యార్థినులతో కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులు

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మెడికో హెల్త్‌కేర్ సొల్యూషన్స్ కంపెనీ శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించింది. సుమారు 100 మంది హాజరుకాగా, 14 మంది ట్రెయినీ ఇన్ రెవెన్యూ సైకిల్ మేనేజ్‌మెంట్ ప్రాసెస్ అసోసియేట్‌గా ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి తెలిపారు. విద్యతోపాటు పోటీ పరీక్షలకు అవసరమైన భాషా నైపుణ్యం, అర్థమెటిక్, రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తుండటం వల్లే విద్యార్థినులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికవుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వారిని అభినందించారు. కంపెనీ ప్రతినిధులు సచిన్, అభిలాష్, నవీన్‌రెడ్డి, ఇందర్‌దీప్ సింగ్‌లతో కలిసి, నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధాన్యం కుప్పను ఢీకొన్న ద్విచక్రవాహనం

- రైతు పరిస్థితి విషమం
- 10 రోజుల్లో రెండు ప్రమాదాలు


గాయపడిన రాములు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రోడ్డుపై ధాన్యం కుప్పను ఢీకొని, ఓ రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి నుంచి రాజన్నపేట వరకు రోడ్డుపై రైతులు వరి ధాన్యం ఆరబెడుతూ, కుప్పగా చేస్తున్నారు. దీంతో రాత్రిపూట ప్రమాదాలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి రాజన్నపేటకు చెందిన ఎర్ర్వుల రాములు అనే రైతు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. చీకట్లో కనిపించక ధాన్యం కుప్పను ఢీకొట్టాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పది రోజుల క్రితం ఇలాగే గాయపడిన సుబ్బారావు కోమాలోకి వెళ్లగా.. హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుపై ధాన్యం పోయకుండా చూడాలని కోరుతున్నారు.

రైతుపై క్రిమినల్ కేసు

రాజన్నపేట శివారులో రోడ్డుపై వరి ధాన్యం ఆరబెట్టి, ప్రమాదానికి కారణమైన రైతు కిష్టునాయక్ తండాకు చెందిన భూక్య నరేశ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రోడ్లపై ఎవరైనా ధాన్యం పోస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

ముస్తాబాద్(సిరిసిల్ల): మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని గూడూరుకు చెందిన చెక్కపల్లి నర్సింలు(47) లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై, భార్య రేణుకతో తరచూ గొడవ పడేవాడు. దీంతో నెల రోజుల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అతిగా మద్యం సేవించిన నర్సింలు నాలుగు రోజుల క్రితం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. శనివారం అతని ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులకు అనుమానం వచ్చి, పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించగా నర్సింలు ఆత్మహత్య చేసుకున్న విషయం బయటపడింది. మృతదేహానికి స్థానికంగానే పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నర్సింలుకు కుమారుడు, కూతురు ఉన్నారు. కొడుకు భరత్ దుబాయ్‌లో ఉండగా తండ్రి మరణవార్త తెలుసుకొని, స్వగ్రామానికి బయల్దేరినట్లు బంధువులు తెలిపారు.